ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
గురువారం 27 నవంబరు 2025 www.prajaswaramdaily.com 3 pm

# ఓ ఇంటివాడైన రాహుల్ సిప్లిగంజ్



హైదరాబాద్, ప్రజాస్వరం: గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ ఈరోజు తెల్లవారు జామున తన ప్రియురాలు హరిణ్యాని పెళ్లి చేసుకున్నాడు. హైదరాబాద్‌లో జరిగిన సిప్లిగంజ్ వివాహానికి సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ప్రస్తుతం వీరి పెళ్లి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నెటిజన్లు ఈ కొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు

## గ్లోబల్ ఇన్వెస్టర్లకు

# భారత స్పేస్ టెక్నాలజీ గమ్యస్థానం

## ఎన్నో క్లిష్ట సమస్యలకు జన్ జీ పరిష్కారం

**భారత యువశక్తి నైపుణ్యానికి స్కైరూట్ గొప్ప ప్రతీక**

**ప్రధాని మోదీ**

**రావిర్యాల స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్‌ను వర్చువల్‌గా ప్రారంభం**

హైద రాబాద్ , ప్ర జాస్వ రం : తొలి ప్రైవేట్ కమర్షియల్ రాకెట్ విక్రమ్-1ను ప్రధాని మోదీ ఆవిష్కరించారు. హైదరాబాద్ రావిర్యాలలోని స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్‌ను ప్రధాని తన చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్చువల్‌గా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు.
ముందుగా స్కైరూట్ బృందానికి అభినందనలను తెలిపారు. అంతరిక్ష రంగంలో ఇది ఒక గొప్ప మైలురాయి అని కొనియాడారు. భారత యువశక్తి నైపుణ్యానికి స్కైరూట్ గొప్ప ప్రతీక అని వ్యాఖ్యానించారు. భారత అంతరిక్ష రంగంలో భవిష్యత్తులో మరిన్ని ఘనతలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్కైరూట్ విజయం భారత యువశక్తికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయం, వాతావరణ అంచనాల్లో మరింత విజ్ఞానం సాధించాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. భారత అంతరిక్ష రంగంలో ఎన్నో సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. స్పేస్ సెక్టార్‌లో కో-ఆపరేటివ్, ఎకో సిస్టమ్‌ను తీసుకువచ్చామన్నారు. జన్ జీ అనుకున్నది సాధించేలా ప్రభుత్వం సహకరిస్తుందని వివరించారు. అంతరిక్ష రంగంలో ఇస్తున్న మద్దతు వల్లే స్టార్టప్‌లు వస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఇలా ప్రైవేటు రంగంలోనూ అంతరిక్ష సంస్థలు పుట్టుకొస్తున్నాయని చెప్పారు.



"జన్ జీ ఇంజినీర్లు, జన్ జీ డిజైనర్లు అవకాశాలు అందుకోవాలి. జన్‌జీ కోడర్స్, జన్ జీ సైంటిస్టులు అవకాశాలు అందిపుచ్చుకోవాలి. ప్రైవేటు స్పేస్ టాలెంట్ మొత్తం ప్రపంచాన్ని ఆకర్షిస్తోంది. గ్లోబల్ ఇన్వెస్టర్లకు భారత స్పేస్ టెక్నాలజీ గమ్యస్థానంగా మారింది. భారత్‌లో అంతరిక్ష రంగ నిపుణులకు కొదవలేదు. భారత్‌లో నాణ్యమైన మ్యానుఫాక్చరింగ్ వ్యవస్థ ఉంది. మన దేశంలో ఆవిష్కరణలను ప్రోత్సహించే విధానాలు ఉన్నాయి. వేర్వేరు రంగాల్లో పుట్టుకొచ్చిన స్టార్టప్‌లు విజయం సాధించాయి. ఎన్నో క్లిష్ట సమస్యలకు మన జన్ జీ పరిష్కారం చూపుతోంది. భారత జన్ జీలో ఎంతో క్రియేటివిటీ, పాజిటివిటీ ఉంది. భారత జన్ జీ ప్రపంచ యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. చిన్న నగరాలు, గ్రామాల నుంచి కూడా స్టార్టప్‌లు పుట్టుకువస్తున్నాయి. దేశంలో కొత్తగా 1.50 లక్షల స్టార్టప్‌లు నమోదు అయ్యాయి."

### అంత రిక్ష రంగంలో ప్రైవేటుకు ప్రోత్సాహం : కిషన్ రెడ్డి



అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థలను కేంద్రం ప్రోత్సహిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తొలి ప్రైవేట్ కమర్షియల్ రాకెట్‌ను స్కైరూట్ రూపొందించిందన్నారు. స్టార్టప్‌లకు కేంద్రం ఇస్తున్న సహకారానికి స్కైరూట్ విజయం ఒక ఉదాహరణ అని కొనియాడారు. స్పేస్ టెక్నాలజీలో భారత మేధస్సు, నైపుణ్యాన్ని మరోసారి చాటారని తెలిపారు. భారత యువతరం స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగుతోందని చెప్పారు. 2047లో చేపట్టే మూన్ మిషన్, గగన్‌యాన్‌కు అందరం సిదం కావాలని పిలుపునిచ్చారు. శుభాంశుశుక్లా అంతరిక్షంలో 18 రోజులు గడిపి కొత్త చరిత్ర సృష్టించారని హర్షం వ్యక్తం చేశారు. శుభాంశు శుక్లా ప్రయాణం ఎందరో విద్యార్థులకు స్ఫూర్తి నిచ్చిందన్నారు. చంద్రయాన్-3 భారత అంతరిక్ష రంగంలో గొప్ప మైలురాయి అని కొనియాడారు. భారత స్పేస్ ఎకానమీ రూ.70,000 కోట్లు దాటిందని వివరించారు. 2030 నాటికి మన స్పేస్ ఎకానమీ రూ.4 లక్షల కోట్లు చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు..

# సిట్ విచారణకు మాజీ సీఎం కేసీఆర్ ఓఎస్డీ

హైదరాబాద్, ప్రజాస్వరం తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చేటు చేసుకుంది. తాజాగా మాజీ సీఎం కేసీఆర్ ఓఎస్డీ రాజశేఖర్ రెడ్డిని . 2 గంటలు పాటు సిట్ అధికారులు విచారించారు. ఆయన స్టేట్మెంట్ రికార్డ్ చేశారు. ఇప్పటివరకు నిందితులు, బాధితుల నుంచి నుంచి సమాచారాన్ని సేకరించారు. ఇప్పుడు క్రోడీకరించే పనిలో పడ్డారు . అందులోని సమాచారం ఆధారంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన వారికి నోటీసులు ఇసున్నారు. ఆ జాబితాలోకి మాజీ సీఎం కేసీఆర్ ఓఎస్డీ రాజశేఖర్ రెడ్డి చేరారు. ఈ కేసు నిమిత్తం ఆయనకు అధికారులు నోటీసులు ఇచ్చారు. గురువారం జూబ్లీహిల్స్ పోలీసుల ముందు విచారణకు హాజరయ్యారు.



సేకరించిన సమాచారం ఆధారంగా దాదాపు 20 ప్రశ్నలు ఆయనపై సంధించినట్టు తెలుస్తోంది. దాదాపు రెండు గంటలపాటు విచారించి స్టేట్ మెంట్ ని రికార్డు చేశారు. గత ఏడాది మార్చిలో అప్పటి టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధా కిషన్ ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం అయ్యింది.

# మరో మూడురోజుల కస్టడీకి ఐ-బొమ్మ రవి




**హైదరాబాద్, ప్రజాస్వరం:** ఐ-బొమ్మ కేసులో వెబ్ సైట్ నిర్వాహకుడు ఇమంది రవిని మురో మూడు రోజుల సైబర్ క్రైమ్ పోలీసులు కస్టడీలోకి తీసుకొన్నారు. గతంలో 5 రోజుల పాటు విచారించిన పోలీసులు పలు కీలక ఆధారాలను సేకరించారు. అతడి బ్యాంకు ఖాతాలకు సంబంధించిన సమాచారం పూర్తి స్థాయిలో దొరకలేదని భావించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు రవిని చంచల్ గూడ జైలు నుంచి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అతడి నెట్ వర్క్ పై మరింత దృష్టి పెట్టనున్నారు.

# చొరబాటుదారులు ఆధార్ సంపాదించడంపై సుప్రీం ఆందోళన

**పౌరసత్వానికి ఆధార్ ప్రూఫ్ కాదని స్పష్టం**



ఢిల్లీ, ప్రజాస్వరం: పౌరసత్వానికి ఆధార్ ప్రూఫ్ కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 'ఆధార్ సామాజిక సంక్షేమ ప్రయోజనాలు అందరికీ చేరేలా చూసుకోవడానికి ఏర్పాటుచేసింది మాత్రమేనని, రేషన్ కోసం ఆధార్ పొందిన వ్యక్తిని.. ఓటర్ ను చేయాలా? విదేశాలకు చెందినవారు ఇక్కడ కార్మికుడిగా పనిచేస్తే వారికి కూడా ఓటు హక్కు కల్పించాలా? అని ధర్మాసనం ప్రశ్నించింది. చొరబాటుదారులు ఆధార్ కార్డులు సంపాదించడంపై ఆందోళన వ్యక్తంచేసింది. ఈ సందర్భంగా పౌరులు కానివారు ఆధార్ కలిగిఉంటే.. వారికి ఓటు హక్కు కూడా ఇచ్చేయాలా? అని ప్రశ్నించింది. ఓటర్ల జాబితాలకు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ )పై విచారణలో భాగంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ లలో 'సర్ ' కసరత్తుపై ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చి ధర్మాసనం గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఓటరు నమోదు ఫారం-6లో పేర్కొన్న వివరాలు సరైనవో, కావో నిర్ధరించుకునే అధికారం ఈసీకి ఉందని తేల్చి చెప్పింది.



# ఇండోనేసియాలో భూకంపం

జకార్తా : ఇండోనేసియాలోని సుమత్రా దీవుల్లో భారీ భూకంపం సంభవించింది. ఇది భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.3గా నమోదైంది. భూకంప కేంద్రం ఆషే ప్రావిన్స్‌కు సమీపంలో భూ ఉపరితలానికి 10 కిలోమీటర్ల లోతున నమోదైంది.

# జీవో 46పై విచారణ రేపటికి వాయిదా

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై జారీ చేసిన జీవో 46ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. వెనుకబడిన కులసంఘాలు న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేశాయి. పిటిషనర్ల తరపున న్యాయవాది సుదర్శన్ వాదనలు వినిపించారు. అత్యవసర పిటిషన్ కింద విచారణ జరపాలని కోరారు. అత్యంత వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కేటాయించాలని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. బీసీలలో ఏబీసీడీ వర్గాల ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. వాదనలు విన్న సీజే ధర్మాసనం శుక్రవారం విచారణ జరుపుతామని పేర్కొంది.



# గ్రూప్2 పై సింగిల్ బెంచ్ ఉత్తర్వులు సస్పెండ్

**హైదరాబాద్: తెలంగాణలో 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు హైకోర్టులో ఊరట లభించింది. గ్రూప్-2పై సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ బెంచ్ తీర్పును టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేయగా.. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది.**

**ఇటీవల సింగిల్ బెంచ్ తీర్పు ఇదీ..**2015-16 గ్రూప్ -2ను రద్దు చేస్తూ ఇటీవల సింగిల్ బెంచ్ సంచలన తీర్పు వెలువరించింది. నాటి ఎంపిక జాబితాను కొట్టివేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు, సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా డబుల్ బబ్లింగ్, వైట్ నర్ వినియోగం, తుడిపివేతలున్న పార్ట్ -బి పత్రాలను పునర్ మూల్యాంకనం చేయడం చెల్లదని పేర్కొంది. హైకోర్టు తీర్పు, సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా వ్యవహరించే అధికారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కు లేదని తేల్చి చెప్పింది. జవాబు పత్రాల్లో ట్యాంపరింగ్ జరిగిందని స్పష్టంగా కనిపిస్తున్నపుడు వాటిని పక్కన పెట్టకపోవడం కమిషన్ వైఫల్యమేనని తేల్చి చెప్పింది. 2019 అక్టోబరు 24న ఇచ్చిన ఫలితాలు ఏకపక్షమనీ, చట్టవిరుదమని వాటిని రద్దు చేసింది. సాంకేతిక కమిటీ సిఫార్సులు, హైకోర్టు తీర్పునకు అనుగుణంగా తిరిగి మూల్యాంకనం నిర్వహించి అర్హుల జాబితాను విడుదల చేసి నియామకాలు చేపట్టాలని, ఈ ప్రక్రియను 8 వారాల్లో పూర్తి చేయాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్ కు ఆదేశాలు జారీ చేసింది.